## క్లుప్తంగా

### అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత లక్ష్మీదేవికి మెమొంటో ఇస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆత్మకూరుకు చెందిన పోగుల లక్ష్మీదేవి సోమవారం రూ.1,00,010 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దాతకు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి మెమొంటో, ప్రసాదాలు, బాండు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు పాల్గొన్నారు.

### పల్లకీలో విహరించిన ఆదిదంపతులు



మహానందిలో పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి సోమవారం రాత్రి పల్లకీసేవ కనులపండుగగా జరిగింది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, టెంపుల్ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్త పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

### ముద్ద చర్మం వ్యాధికి చికిత్స



మహానంది: స్థానిక దేవస్థానంలోని గోశాలలో లంపీస్కిన్(ముద్ద చర్మం)వ్యాధితో బాధపడుతున్న లేగదూడకు సంరక్షకుడు బెక్కెం శరభయ్యశర్మ, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిలు గ్రామీణ పశు వైద్యుడి చేత సోమవారం రాత్రి వైద్యసేవలు అందించారు.

### క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం అంతర్ జిల్లా మెగా క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు మొమీన్‌మున్నీర్‌బాషా, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, ఫసిపుల్ మున్నా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు.

### బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలని హెడ్స్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్ అన్నారు. స్థానిక నందమూరినగర్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏ ఒక్క బాల్య వివాహం జరగకుండా వేదపండితులు, పురోహితులు, పాస్టర్లు, ఇమామ్‌లు, మత పెద్దలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ మాజీ సభ్యులు రాజేశ్వరమ్మ, సుబ్బరాయుడు, సంతప్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### రూ. 2.50 లక్షల నగదు మిస్సింగ్

కోవెలకుంట్ల: సంజామలకు చెందిన ఓ వ్యక్తి మోటార్‌సైకిల్ సైడ్‌బ్యాగ్‌లో ఉంచుకున్న నగదు కనిపించలేదు. స్థానికుల సమాచారం మేరకు.. సంజామలకు చెందిన శివరామిరెడ్డి బైక్‌లోని సైడ్‌బ్యాగ్‌లో రూ. 2.50 లక్షల నగదు ఉంచుకుని సోమవారం సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు బయలుదేరాడు. పట్టణ శివారులోని రైల్వే వంతెన సమీపంలో ఓ మహిళ చంటిబిడ్డతో వేచి ఉండి లిఫ్ట్‌కోసం బైక్ ఆపాలని చేయి ఎత్తింది. ఆమెను బైక్‌పై ఎక్కించుకోగా కొద్ది దూరంలోనే పెట్రోల్ బంకు వద్ద దిగి వెళ్లిపోయింది. తర్వాత శివరామిరెడ్డి కోవెలకుంట్లకు చేరుకుని కరెంట్ ఆఫీస్‌లో బిల్లు కట్టి తిరిగి టౌన్‌లోకి వెళ్లాడు. సెల్ రిపేరీ ఉండడంతో సెల్‌పాయింట్‌లోకి వెళ్లి రిపేరు చేయించుకుని బైక్ వద్దకు చేరుకున్నాడు. సైడ్ బ్యాగ్‌లో నగదు పరిశీలించుకోగా లేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ఆ మహిళ పట్టణంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగించేదని, డబ్బులు తీయలేదని తేలింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

# దాహం.. దాహం

- గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్న కపిలేశ్వరం గ్రామస్తులు
- బిందె నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్తున్న మహిళలు



గ్రామ శివారులో బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న దృశ్యం

కొత్తపల్లి: పల్లెలే పట్టణాలకు పట్టుగొమ్మలంటూ ఆ పట్టుకొమ్మల్లో నివసించే ప్రజానీకానికి ఏ సమస్య రాకుండా చూడడమే ప్రభుత్వాల లక్ష్యమని పాలకులు ఉపన్యాలు ఊదరగొడుతుంటారు. కానీ నల్లమల్ల అడవులకు కృష్ణమ్మ తీరాన ఉన్న కపిలేశ్వరంలో మాత్రం దాహంతో ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం పంచాయతీలోని మజారా గ్రామమైన కపిలేశ్వరంలో సుమారు 35 కుటుంబాలున్నాయి. ఈ గ్రామం ఒక వైపు కృష్ణమ్మ తీరం, మరోవైపు దట్టమైన నల్లమల అడవుల మధ్య ఉంది. వేసవి ప్రారంభమైనప్పటి నుంచి నీటి ఎద్దడితో గ్రామస్తులు అల్లాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నీటి కోసం మహిళలు ప్రతిరోజు గ్రామ శివారులోని నీటి మునక ప్రాంతానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సమీపంలో కృష్ణమ్మ కనిపిస్తున్నా తాగేందుకు గుక్కెడు నీటి కోసం కష్టాలు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

#### తాగేందుకు నీళ్లివ్వండి



నీళ్ల కోసం ఊరి చివరికి నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. మా గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఏ అధికారి కూడా రాడు. కనీసం తాగేందుకు నీళ్లైనా ఇవ్వండి. – లింగస్వామి

#### నీటి కోసం పడిగాపులు



నీటి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు నీటిని తెచ్చుకునేందుకు గ్రామ శివారులో ఉన్న నీటి మునక ప్రాంతానికి వెళ్తున్నాం. ఒకే ఒక బోరు ఉండడం వల్ల గ్రామస్తులకు సరిపోవడం లేదు. అయినా అదే బోర్ వద్ద గంటల తరబడి ఉండి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. – మల్లమ్మ

## మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

## విధినిర్వహణను భగవంతుని సేవగా భావించండి

- ఈఓ ఎం శ్రీనివాసరావు



సెక్యూరిటీ సిబ్బందికి సూచనలిస్తున్న ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: విధి నిర్వహణను భగవంతుని సేవగా భావించాలని ఈఓ ఎం శ్రీనివాసరావు సూచించారు. శ్రీశైల దేవస్థానం భద్రతా సిబ్బందికి సోమవారం చంద్రవతి కల్యాణ మండపంలో సీఐ జి. ప్రసాదరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, పోలీస్ సిబ్బంది భద్రతా చర్యలకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రీశైలక్షేత్రాన్ని ప్రతీరోజు వేలాదిసంఖ్యలో భక్తులు సందర్శిస్తున్నారన్నారు. క్షేత్ర భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. టోల్ గేట్ వద్ద తనిఖీలు నిర్వహించేటప్పుడు ఎంతో పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఉత్సవాల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం సీఐ ప్రసాదరావు దేవదాయ ధర్మదాయచట్టాన్ని అమలు చేసే విషయానికి సంబంధించిన అంశాలను వివరించారు. సమావేశంలో పర్యవేక్షకులు కె.అయ్యన్న పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

బండిఆత్మకూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం స్థానిక ప్రాథమిక కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ఆరోగ్య శాఖ మార్గ దర్శకాల ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంపును కల్పించాలని, 6 నెలల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనంతో పాటు, నిర్వహణ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు మనీషా, యూసుపున్నీషా, బాల సుబ్బమ్మ, తేజ పుష్ప, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 9959225801కు తెలియజేయవచ్చన్నారు. విచారణ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### వాహనాల తనిఖీ

పాములపాడు: స్థానిక కేజీ రోడ్డుపై ఎస్ఐ సురేష్‌బాబు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన చోదకుల నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఆయన వెంట ఏఎస్ఐ ఏసయ్య, కానిస్టేబుల్ ఖాజా ఉన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి



దీక్షలో మాట్లాడుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కలిముల్లా, జిలానీ, గౌస్ ఆజం, రహంతుల్లా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిపో ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టారు. వారు దీక్షలో కూర్చొని మాట్లాడారు. 1/2019 భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్స్, రిమూవల్స్ ఆపాలన్నారు. పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన అన్ని కేటగిరీల్లోని ప్రమోషన్లు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఎంఎం బాషా, నాయకులు షఫీవుల్లా, హరినాథ్‌రెడ్డి, కుమార్, గఫూర్, ఎంఎండీ మియా పాల్గొన్నారు.

### పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నందికొట్కూరు: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జరిగిన టీడీపీ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తెలుగు దేశం పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త, నాయకులు పాటుపడాలన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు దేవళ్ల మురళి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు ప్రసాదరెడ్డి, మహేశ్వరరెడ్డి, ముర్తుజావలి, కాతా రమేష్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు బిల్లులు మంజూరు చేయాలి



ఉపాధి కూలీలతో చర్చిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: రెండు నెలల నుంచి ఉపాధి కూలీలకు బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పని చేసిన కూలీలకు బిల్లులు మంజూరు చేయకుండా కడుపులు కాల్చడం ఎంత వరకు సమంజసమన్నారు. పనులు చేసే ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పనిముట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. జంగంపాడు గ్రామ ప్రజలకు ఉపాధి పనులు తక్షణమే కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, నాగరాజు, శ్రావణి, సువర్ణ, శంకర్‌నాయక్, రాజు, పార్వతమ్మ, ఏసమ్మ, వెంకటరాములమ్మ పాల్గొన్నారు.

### ఆలయ భూములకు బహిరంగ వేలం పాట

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన పార్వతీ సమేత తాండవ మల్లేశ్వర స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన భూములకు సోమవారం ఆలయ ఈఓ కార్తీక్, ఏఎస్ఐ రామ్ నాయక్ ఆధ్వర్యంలో తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేలంపాటలు నిర్వహించారు. 58 ఎకరాల భూమికి వేలం పాటల ద్వారా రూ.6,37,500 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు.

## పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి



జూపాడుబంగ్లాలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వారి వ్యక్తిగత భూసమస్యలతోపాటు గ్రామాల్లోని సమస్యలను లిఖిపూర్వకంగా ప్రజాసమస్యల పరిష్కారవేదికలో తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు.

### కోలుకోలేక మహిళ మృతి

పాములపాడు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు భార్య కోలుకోలేక సోమవారం మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఈ నెల 2న ఇస్కాల గ్రామానికి చెందిన రైతు సోమేశ్వరుడు అప్పుల బాధ భరించలేక తల్లి శివమ్మ, భార్య లావణ్య(28), కూతురు నిఖిత, కుమారుడు భరత్‌లతో కలిసి శీతల పానియంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా అందులోని భరత్ అనే బాలుడు ఈనెల 22న మృతిచెందగా, లావణ్య సోమవారం మృతి చెందింది.

## ఆర్టీసీ కార్మికులకు పదోన్నతులివ్వాలి



రిలే నిరాహార దీక్షలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

నందికొట్కూరు: ఆర్టీసీ కార్మికులకు పదోన్నతులు కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పబ్బతి సుధాకర్, డిపో కార్యదర్శి వైడీఆర్ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 114 జీఓలో పొందపరిచిన నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి కిలోమీటర్లు బట్టి రూ.300, రూ.400 పాత పద్ధతిలో మంజూరు చేయాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. దీక్షలో ఎన్ఎంయూ నాయకులు రామస్వామి, డీఏ రజాక్, శేఖర్, రవీంద్రకుమార్, గ్యారేజీ కార్మికులు పాల్గొన్నారు.

### ఉప సభాపతి క్షమాపణ చెప్పాలి

పగిడ్యాల: రాష్ట్ర ఉప సభాపతి, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్, కేవీపీఎస్ నాయకురాలు గంధం ఉసేనమ్మ డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండు ఆవరణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అసభ్యకరంగా దూషిస్తూ ఉప సభాపతి పదవికే కళంకం తెచ్చారన్నారు.

## ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి



నూతన ఆర్యవైశ్య జిల్లా సంఘం సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి కొప్పరపు రవిప్రసాద్, ఉపాధ్యక్షులు కొత్త శ్రీరామచంద్రమూర్తి, దొంతు నరేష్‌లు సూచించారు. సంఘం నూతన కమిటీ సభ్యులు సోమవారం జిల్లా అధ్యక్షులు శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మరింత అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ..**

స్థానిక ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరహరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా శేగు కిరణ్‌కుమార్, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా దొంతు నరేష్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా దొంతు సురేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నందికొట్కూరు అధ్యక్షులు వీరబొమ్మ నాగసత్యనారాయణ, నాయకులు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### సుదర్శనవర్మకు ఘన నివాళి



సుదర్శనవర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: కామ్రేడ్ సుదర్శన్‌వర్మ వర్ధంతి సందర్భంగా స్థానిక సుదర్శనవర్మ భవన్‌లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్.స్వాములు మాట్లాడుతూ దున్నేవాడికే భూమి కావాలని, భూస్వాములను ఎదురించి పేదలకు భూములు పంచిన చరిత్ర సుదర్శనవర్మదన్నారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు రామ్‌నాయక్, వీరన్న, షేక్ ఇస్మాయిల్, మండల నాయకులు చందావారి వెంకటేశ్వర్లు, మహమ్మద్, గణపతి, బొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కరివేనలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా మండలంలోని కరివేన గ్రామంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు యువకులు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికి పందల చర్య అన్నారు. ఉగ్రదాడిలో మృతిచెందిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చెప్పారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గ్రామంలోని ప్రధాన రోడ్లపై నిరసన ర్యాలీ చేపట్టారు.

### అర్జీలను వెంటనే పరిష్కరించండి

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతుల నుంచి అందిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

వెలుగోడు: విద్యతో పాటు క్రమశిక్షణ కలిగిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్, గ్రంథాలయ శాఖ అధికారిణి సుమలత తెలిపారు. శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బ్రహ్మం నాయక్ మాట్లాడుతూ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన జె సాయిస్ఫూర్తి (596), చరణ్య (591)లను మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో లిటిల్ ఏంజెల్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## పీ4 సర్వేలో గుర్తించిన కుటుంబాలకు చేయూత

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: పీ4 సర్వే ద్వారా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరికాన్ని నిర్మూలించేందుకు పీ4 సర్వే చేసి రాష్ట్రంలో ఉన్న సంపన్నులను మార్గదర్శులుగా, అత్యంత పేదవారిని బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి అవసరమైన చేయూతను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 43,021 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అదే విధంగా జిల్లా పరిధిలో ఉన్నత స్థాయి వ్యక్తులను గుర్తించి మార్గదర్శులుగా నమోదు చేయాలన్నారు. జిల్లా అధికారులు కూడా బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలని కోరారు.

**బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం**

జిల్లా కేంద్రంలో కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో త్వరలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీలో వెయ్యి రూపాయలు చెల్లిస్తే జీవితకాలం సభ్యత్వం ఉంటుందని, రూ.12 వేలు చెల్లించి వైస్ ప్యాట్రాన్‌గా, రూ.25 వేలు చెల్లించి ప్యాట్రాన్‌గా ఉండే అవకాశం ఉందని, ప్యాట్రాన్, వైస్ ప్యాట్రాన్‌కు ప్రెసిడెంట్ చేతుల మీదుగా సర్టి ఫికెట్, మిగతా వారికి గవర్నర్ చేతులమీదుగా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారు లు రూ.1000, ఆధార్ కార్డు, 2 ఫొటోలు ఇచ్చి శాశ్వ త సభ్యత్వం పొందాలన్నారు.జేసీ విష్ణుచరణ్, డీ ఆర్ఓ రాముునాయక్,డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

**లక్ష పనిదినాలు కల్పించండి**

ఉపాధి కూలీలకు లక్ష పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తదితరులతో సమీక్షించారు. ఆత్మకూరు, నందికొట్కూరు, వెలుగోడు, పగిడ్యాల మండలాల్లో తక్కువ వేజ్ రేటు వచ్చినట్లు తెలిపారు. బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో తక్కువ పురోగతి ఉందన్నారు. అవుకు, నందికొట్కూరు మండలాల్లో ఉపాధి వేతనదారుని సగటు కూలి అధిక శాతం సాధిస్తుంటే కొత్తపల్లి, వెలుగోడు, పాములపాడు మండలాలు తక్కువ రేటు రావడానికి కారణాలు ఏంటని అధికారులను ప్రశ్నించారు.